BHARATH SAMACHAR DIGITAL

13, నవంబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

కేరళ స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం



భారత్ సమాచార్, సిద్దిపేట జిల్లా: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతోపాటు ఉపాధ్యాయుల బాధ్యతలను వారికి పరిచయం చేసే ఉద్దేశంతో హుస్నాబాద్‌లోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నవంబర్ 14న జరుపుకునే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఈ కార్యక్రమాన్ని ముందస్తుగా ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల బాధ్యతలు చేపట్టారు. సాధారణంగా పాఠాలు వినే విద్యార్థులే టీచర్ల స్థానంలో నిలబడి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తరగతులను నిర్వహించడం, పాఠాలను వివరించడం వంటి బాధ్యతలను ఉత్సాహంగా చేపట్టారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమలోని బోధనా నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించారు.



ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతంగా వ్యవహరించే గుణం పెంపొందుతాయని చెప్పారు. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడటం ద్వారా వారి బాధ్యతలు, కష్టాన్ని విద్యార్థులు అర్థం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అల్లే శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం పాఠశాలలో సందడి వాతావరణాన్ని తీసుకొచ్చింది.

© 2026 Bharath Samachar